సాక్షి
నిజామాబాద్
7
శనివారం । 7 । జనవరి । 2023



రైతు రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బండి సంజయ్



కలెక్టరేట్ వద్ద సంజయ్‌తో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



సంజయ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

న్యూస్‌రీల్

మరో రెండు రోజులు చలిగాలులు

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా చలిగాలులు ప్రజలను వణికిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉంది. మరో రెండు రోజుల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. కాని సగటు ఉష్ణోగ్రతల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. శుక్రవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 18.5, గరిష్ట ఉష్ణోగ్రత 29.0 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఈ నెల 9వ తేదీ తర్వాత కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతాయని, 15వ తేదీ వరకూ చలి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

21 నుంచి తెయూలో అంతర్జాతీయ సదస్సు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు 'ఇన్నోవేషన్ ఇన్ బయాలజీ అండ్ మెడిసిన్' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. శుక్రవారం సదస్సు బ్రోచర్లను తెయూ వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ సదస్సుకు దేశవిదేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్, జవేరియా ఉజ్మా, కిరణ్మయి, శీల, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

యూజీ బ్యాక్‌లాగ్ పరీక్షల తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ(యూజీ) బ్యాక్‌లాగ్ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు కంట్రోలర్ ఎం.అరుణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జరగాల్సిన మోడ్రన్ లాంగ్వేజెస్ తెలుగు, ఇంగ్లిష్ సెకండ్ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షను ఈ నెల 21న, 16న జరగాల్సిన 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షను 23న నిర్వహిస్తారని పేర్కొన్నారు. మిగిలిన పరీక్షలన్నీ షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telangana university.ac.inను సంప్రదించాలన్నారు.

ఎస్సారెస్పీ డ్యాంపై మరో కంట్రోల్ రూం..



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై ఫ్లడ్ కంట్రోల్ కోసం మరో రూం నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కంట్రోల్‌రూం, జనరేటర్ రూంల కోసం రూ. 40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న రూం పక్కనే ఆనకట్టపై మరో రూం నిర్మాణానికి పనులను ప్రారంభించారు. దానికి ఎదురుగా జనరేటర్ రూం నిర్మించాలని నిర్ణయించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించినట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు.

ఈసారి బియ్యం ఐదు కిలోలే..

మోర్తాడ్(బాల్కొండ): కరోనా ఉధృతి సమయంలో అమలు చేసిన ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై)ను కేంద్రం మరో ఏడాది పాటు పొడిగించినా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి తూట్లు పొడిచిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ కార్డు వినియోగదారులకు ఒక్కో వ్యక్తికి ఐదు కిలోలు కేంద్రం, మరో ఐదు కిలోలు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సి ఉంది. పీఎంజీకేఏవై పథకం కింద బియ్యం సరఫరా అయినా ఒక్కో వ్యక్తికి పాత పద్ధతిలో ఐదు కిలోల చొప్పున బియ్యంను పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. ఐదు కిలోల ప్రకారమే బియ్యంను పంపిణీ చేయడానికి రేషన్ దుకాణాలకు బియ్యాన్ని సరఫరా చేశారు. జిల్లాలో 751 రేషన్ దుకాణాలకు 6,020 మెట్రిక్ టన్నుల బియ్యంను కేటాయించారు. ఆహార భద్రత కార్డుల వినియోగదారులు 3,81,224, అంత్యోదయ కార్డు హోల్డర్లు 20,940, అన్నపూర్ణ కార్డుల వినియోగదారులు 1,061 మంది ఉన్నారు. పది కిలోల చొప్పున బియ్యంను పంపిణీ చేయాలంటే 12వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. సగం కోటానే కేటాయించడంతో 5 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేయడానికి రేషన్ డీలర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. పీఎంజీకేఏవై పొడిగించినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ముట్టడి ఉద్రిక్తం!


కామారెడ్డి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు బీజేపీ శ్రేణుల యత్నం
- పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట
- బండి సంజయ్‌ని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించిన పోలీసులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి కలెక్టరేట్ వద్ద శుక్రవారం రాత్రి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రైతులు, బీజేపీ నాయకులు కలెక్టరేట్‌కు తరలివచ్చి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఆత్మహత్యకు పాల్పడిన పయ్యావుల రాములు కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లారు. పోలీసులు ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోగా.. బీజేపీ శ్రేణులు వాటిని తోసివేసి ముందుకువెళ్లారు. బండి సంజయ్‌తో పాటు నేతలంతా కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు ప్రధాన గేటును మూసి ఉంచడంతో సాధ్యపడలేదు. కొందరు గేటు పైకి ఎక్కి లోపలికి దూకేందుకు యత్నించారు. దాదాపు గంట పాటు బీజేపీ శ్రేణులు, రైతులు లోపలికి వెళ్లడానికి పోలీసులతో తలపడ్డారు. చివరకు పోలీసులు బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఘర్షణ వాతావరణం..

సంజయ్‌ను తరలిస్తున్న వాహనం ముందుకు కదలకుండా బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కొందరు పోలీస్ వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో మరోవాహనం కూడా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. పోలీసులు బీజేపీ శ్రేణులను అడ్డుకుని బలవంతంగా వాహనాన్ని ముందుకు తీసుకువెళ్లి బండి సంజయ్‌ని హైదరాబాద్‌కు తరలించారు. కాగా పోలీసు వాహనంపై దాడి చేసిన వారిలో కొందరిని పోలీసులు పట్టుకుని తమ వాహనాల్లో తరలించారు. వారిని విడుదల చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. కాగా వాహనాన్ని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గీతదాటిన వారిపై చర్యలు తప్పవన్నారు.

రైతుల కోసం ఎందాకైనా..

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- రైతు కుటుంబానికి పరామర్శ

సదాశివనగర్: రైతుల కోసం ఎందాకైనా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భూమి పోతుందని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు రాములు కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో కూర్చుంటే రైతుల సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సింది పోయి, తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవాలని చూస్తోందని, దీనిని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మాస్టర్ ప్లాన్‌లో భూములు పోతున్నాయని రైతులు ఆందోళన చెంది, ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. రైతులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు విఠల్ తదితరులు ఉన్నారు.


అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్


కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నిస్తున్న రైతులు, బీజేపీ కార్యకర్తలు


బండి సంజయ్‌ని తరలించకుండా అడ్డుకుంటున్న మహిళా నేతలు

- మరిన్ని చిత్రాలు 8లో..

బంద్ సక్సెస్..

- స్వచ్ఛందంగా పాల్గొన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు
- మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలు


కామారెడ్డిలోని గంజ్ రోడ్డు మూసిఉన్న దుకాణాలు

సాక్షి కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాలో నూతన మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా సర్కారు స్పందించకపోవడంతో శుక్రవారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గ బంద్ విజయవంతమైంది. వాణిజ్య, వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్లు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పెట్రోల్ బంక్‌లు తెరచుకోలేదు. మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు వాహనాలతో రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. వీరికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలిచారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటిగౌడ్, జిల్లా నాయకుడు అరుణ్‌తో పాటు పలువురు ఇందిరాచౌక్ వద్ద ధర్నా చేశారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. వైఎస్సార్‌టీపీ నాయకులు నీలం సుధాకర్, తాహెర్ తదితరులు పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మొదట ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇంటిని ముట్టడించాలని భావించారు. కుదరకపోవడంతో పోలీసులకు తెలియకుండా అశోక్‌నగర్ కాలనీ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు చేరుకుని, పార్కు గోడ దూకి కార్యాలయంలోకి వెళ్లారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా రవీందర్‌రెడ్డి చొక్కా చిరిగింది. ఆయన మున్సిపల్ కార్యాలయం

బల్దియా వద్ద ఆందోళన

ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు అరెస్టు చేసి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్‌ల వైఖరితో అమాయక రైతులు నష్టపోతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పూర్తిగా రైతు వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు.



తెల్లవారుజామునుంచే..


వెంకటరమణారెడ్డిని తరలిస్తున్న పోలీసులు

బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డిని పోలీసులు తెల్లవారుజామునే హౌస్ అరెస్టు చేశారు. తర్వాత ఆయనను రాజంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం 6 గంటలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అక్రమంగా అరెస్టు చేశారని, ఇది సిగ్గుచేటని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దయ్యే వరకు రైతులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు బాధిత రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ కౌన్సిలర్లు శ్రీనివాస్, నరేందర్, పండ్ల ప్రవీణ్, పార్టీ నాయకులు విపుల్, నరేందర్‌రెడ్డి, సురేశ్‌లను అరెస్టు చేసి మాచారెడ్డి, భిక్కనూరు, గాంధారి తదితర పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

రైతుల వాహనాలు లాక్కొని..


రైతుల వాహనాల తాళాలు తీసుకుంటున్న పోలీసులు

లింగాపూర్, ఇల్చిపూర్, దేవునిపల్లి, టేక్రియాల్, అడ్లూర్ ఎల్లారెడ్డి, రామేశ్వరపల్లి గ్రామాలకు చెందిన మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు బైక్‌లపై జిల్లా కేంద్రంలో ర్యాలీ తీశారు. గ్రూపులుగా వచ్చి ఆందోళనలు చేశారు. మున్సిపల్ కార్యాలయం, కొత్త బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తాల వద్ద పోలీసులు వారి వాహనాలను అడ్డుకున్నారు. వాహనాల తాళాలు తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం దేవునిపల్లితోపాటు చుట్టుపక్కలనున్న పీఎస్‌లకు తరలించారు. పోలీసుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ రద్దయ్యేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

కిసాన్ కాదు.. కసాయి సర్కారు


ధర్నా చేస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

మాజీ మంత్రి షబ్బీర్ అలీతో పాటు కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ నాయకుడు కోదండరెడ్డి, సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఇందిరాచౌక్‌కు వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఇది కిసాన్ సర్కారు కాదని కసాయి సర్కారు అని పేర్కొన్నారు. పచ్చని పొలాల్లో మాస్టర్‌ప్లాన్‌తో మంట పెట్టారని ఆరోపించారు. పొలాల్లో ఉండాల్సిన రైతులను రోడ్లపైకి తెచ్చారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు భూ దందాల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి సరైన ప్రకటన రాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రైతుల ఆందోళనపై మంత్రి కేటీఆర్ స్పందించినా కలెక్టర్ మాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నిద్ర పట్టకుండా చేస్తోందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ఆరోపించారు. కామారెడ్డికి ఇండస్ట్రియల్ జోన్ అవసరం లేదన్నారు. ప్రభుత్వం కన్ను పేదలు, రైతుల భూములపై పడిందని కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. రైతుతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా ముందరపడ్డ దాఖలాలు లేవన్నారు. అనంతరం పోలీసులు కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి పట్టణ స్టేషన్‌కు తరలించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, నాయకులు సందీప్‌లను బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ వాహనంతో ఎక్కించారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విడుదల చేసిన తర్వాత మాజీ మంత్రి షబ్బీర్ అలీ కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందించారు.


గంప గోవర్ధన్ ఇంటి వద్ద పోలీసుల బందోబస్తు

భారీ బందోబస్తు

కామారెడ్డి నియోజకవర్గ బంద్ నేపథ్యంలో పోలీస్ శాఖ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైల సారథ్యంలో జిల్లా కేంద్రంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రధాన చౌరస్తాలలో పోలీసులను మోహరించింది. బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులను గుర్తించి ఎక్కడికక్కడే అరెస్టు చేశారు.

ప్రభుత్వ విప్ ఇంటి వద్ద..

అశోక్‌నగర్ కాలనీలో గల ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశా రు. ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి మాస్టర్ ప్లాన్ బా ధితులు, రైతు జేఏసీల ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో నిర్ణయం తీసుకున్నారు.

బెయిలిఫ్, న్యాయవాదిపై కేసులు ఎత్తివేయాలి

- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

ఖలీల్‌వాడి: జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో బెయిలిఫ్, న్యాయవాది, ఇతరులపై పెట్టించిన కేసులను వెనక్కి తీసుకోవాలని బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి, కోర్టు ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బెయిలిఫ్, న్యాయవాదితో పాటు ఇతరులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలన్నారు. జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు అటాచ్‌మెంట్ ఉత్తర్వులను కలెక్టర్ ఆఫీసుకు కోర్టు బెయిలిఫ్ సంబంధిత కౌన్సిల్‌తో పాటు డిక్రీ హోల్డర్లు వెళ్లగా.. కలెక్టర్ ఆఫీసు సిబ్బంది అటాచ్‌మెంట్‌కు సహకరించలేదన్నారు. కోర్టు బెయిలిఫ్, న్యాయవాది, ఇతరులపై కేసులు నమోదు చేశారన్నారు. తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించింది. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించిన కలెక్టర్‌పై కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు తులసీదాస్, కిరణ్‌కుమార్, బిట్టారవి, మధుసూదన్, బాలరాజు నాయక్, వరలక్ష్మి, వసంత్‌రావు పాల్గొన్నారు.


జిల్లా కోర్టు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

- పూర్తిగా ధ్వంసమైన గృహం
- నుజ్జునుజ్జయిన ఆటో, స్కూటీ, టీవీఎస్ వాహనాలు
- ఏడుగురు కుటుంబ సభ్యులకు తప్పిన ప్రాణాపాయం


తాడ్వాయి మండలం కృష్ణాజీవాడిలో ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడిలో కామారెడ్డి-ఎల్లారెడ్డి రహదారి పక్కన గల నివాసపు ఇంట్లోకి లారీ దూసుకెళ్లింది. ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా, ఇంటి ముందున్న ప్యాసింజర్ ఆటో, స్కూటీ, టీవీఎస్ ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. కాగా ఇంట్లో నివసిస్తున్న ఏడుగురికి ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి 11గంటల సమయంలో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వైపు వెళుతున్న లారీ రోడ్డు పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. మొదట రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం, చెట్టును ఢీకొని ఇంటి వాకిట్లో ఉన్న ప్యాసింజర్ ఆటోతో సహా ఇంట్లోకి లారీ వెళ్లింది. ఇంటి వెనుక భాగంలో గల రూమ్‌లో ఇంటి యజమాని మరిపల్లి రాజయ్య, ఆయన భార్య లక్ష్మి నిద్రించగా, మరో రూమ్‌లో కొడుకు కాశీరాం, కోడలు మణెవ్వ, మనుమడు వినేష్, మనువరాలు వీణ, అవంతిక నిద్రపోతున్నారు. లారీ వారున్న గదుల వరకు వెళ్లకుండా ఇంటి మధ్యలోనే ఆగడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇంటి పైకప్పు పెల్లలు వారిపై పడడంతో చిన్నచిన్న గాయాలయ్యాయి. పెద్ద శబ్దం కావడంతో ఇంటి చుట్టుపక్కల వారు నిద్ర నుంచి లేచి బయటకు వచ్చారు. ఇంట్లో చిక్కుకున్న ఏడుగురిని బయటకు తీశారు. ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. సుమారు రూ. 10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపించారు. తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆర్థికంగా ఆదుకోండి

ఇల్లు, ఆటో, స్కూటీ, టీవీఎస్ పూర్తిగా ధ్వంసం కావడంతో మాకుటుంబం వీధిన పడిందని, తమను ఆదుకోవాలని కుటుంబ యజమాని మరిపల్లి రాజయ్య వేడుకున్నాడు. కూలీనాలి చేసుకుంటూ జీవనాన్ని గడుపుతున్నామని, నాకొడుకు ఆటో నడుపుతాడు, కోడలు కూలి పనిచేస్తుందని తెలిపాడు. రెక్కాడితే డొక్కాడని మాకు ఇల్లు అద్దెకు తీసుకుందామంటే కూడా మావద్ద డబ్బులు లేవన్నాడు. గురువారం చిన్న మనుమరాలు అవంతిక పుట్టిన రోజు కావడంతో రాత్రి 10గంటల వరకు మెలకువతో సంతోషంగా ఉండి అనంతరం పడుకున్నామని, గంటకే ఘటన జరగడం జీర్ణించుకోలేక పోతున్నామన్నాడు.

క్లుప్తంగా

ప్రకృతి విపత్తులు, ప్రమాదాలపై అవగాహన



బోధన్‌రూరల్(బోధన్) : మండలంలోని హంగర గ్రామంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. టెన్త్ బెటాలియన్ నేషనల్ డిజస్టార్ రెస్పాన్స్ ఫోర్స్ కమాండర్, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ బిట్విన్ సింగ్, ఏఎస్సై వైవీ రెడ్డి, 16 మంది బృందం ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, వరదాలు, గ్యాస్ లీకేజీలు, గుండె నొప్పిలు వంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఎలా వ్యవహరించారు. ఎస్సై సందీప్, తహసీల్దార్ వరప్రసాద్, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

అర్చక ఆగమ పరీక్షకు 95 మంది హాజరు



నిజామాబాద్ సిటీ : దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అర్చక ఆగమ పరీక్షకు తొలిరోజు 95 మంది హాజరయ్యారు. నగర శివారు మాధవనగర్ సాయిబాబా ఆలయం కల్యాణ మండపంలో జోనల్ ఆఫీసర్ విజయ రామారావు, ఉమ్మడి జిల్లాల దేవాదాయ శాఖ కమిషనర్ ఎన్ సుప్రియ పర్యవేక్షణలో ఆగమ పరీక్ష జరిగింది. 126 మంది అభ్యర్థులకు గాను 97 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు కార్యాలయ సిబ్బంది, ఆలయ కార్యనిర్వాహణ అధికారులు, ఆలయ సిబ్బంది అధికారులుగా విధులు నిర్వహించారు.

పోక్సో కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలూర్ మండలం దేగాం గ్రామ శివారు ఇటుక బట్టీలో ఓ కుటుంబ మహారాష్ట వచ్చిన కుటుంబం పనిచేస్తోంది. అదే గ్రామంలో వరినాట్లు వేసేందుకు బీహార్ నుంచి కొంత మంది వచ్చారు. కాగా మహారాష్ట్రకు చెందిన కుటుంబంలోని పదకొండేళ్ల బాలికను వరినాట్లు వేసేందుకు బీహార్ నుంచి వచ్చిన అమర్‌కుమార్ మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు. కాగా బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



సుభాష్‌నగర్ : పెరిగిన ధరలకనుగుణంగా మెస్‌ఛార్జీలు రూ. 3,500లకు పెంచాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారంరాత్రి కలెక్టరేట్ ఎదుట నిద్రించి, చెవుల్లో పూలు పెట్టొద్దని వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. ఈ నేపథ్యంలో పోలీసులతో, నాయకులు వారించారు. అనంతరం విఘ్నేష్ మాట్లాడుతూ అద్దెభవనాలు, శిథిలావస్థకు చేరిన హాస్టళ్లను పునర్నిర్మించాలని డిమాండ్‌చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వసతిగృహాల్లో దుప్పట్లు, దోమతెరలు, ట్రంక్ బాక్సులు, పాకెట్ మనీసైతం ప్రభుత్వమే అందించాలన్నారు. కలెక్టర్ స్పందించి సంక్షేమ వసతిగృహాలను సందర్శించి, పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విశాల్, మహేష్, శ్రీశైలం, ప్రసాద్, జవహర్, అరవింద్, సందీప్, రాజు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు చేరిన నివేదిక

- ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై ఆరోపణల నేపథ్యంలో..
- ఇష్టారాజ్యంగా గైర్హాజరు, రెవెన్యూ లోటు, క్రైం డిటెక్షన్ లేకపోవడంపై విచారణ



ఖలీల్‌వాడి : నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో గైర్హాజరు,కానిస్టేబుళ్లకు మధ్య జరుగుతున్న వివాదానికి సంబంధించిన సమగ్ర నివేదిక రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు చేరినట్లు సమాచారం.ఎక్సైజ్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డిప్యూటీ కమిషనర్ దశరథం వేరువేరుగా ఈ వివాదంపై విచారణ చేసినట్లు తెలిసింది. డీసీ అంతర్గత విచారణ చేసినట్లు సమాచారం. ఈ నివేదికల ప్రకారం నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మమత గతంలో పనిచేసిన ప్రాంతాల్లో వివరాలను ఆరా తీసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఎస్‌హెచ్‌వోగా ఆమె పనిచేసిన సమయంలో వచ్చిన ఫిర్యాదులను కూడా తెరపైకి తీసుకొచ్చినట్లు సమాచారం.

నివేదికలో ఉన్న అంశాలివే..

నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మమతపై వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు చేపట్టిన విచారణలో ఆయా విషయాలు పొందుపర్చినట్లు సమాచారం. జిల్లాలో నగరం నుంచి ఎక్సైజ్ శాఖకు 40 శాతం మేరకు ఆదాయం సమాకూర్చాల్సి ఉంటుంది. కాని గతేడాది డిసెంబర్ 2021లో రూ. 57.95 కోట్లు ఆదాయం రాగా 2022 డిసెంబర్‌లో రూ.47.50 కోట్లు ఆదాయం వచ్చింది. అంటే ఎక్సైజ్ శాఖకు రూ.3.45 కోట్లకు పైగా ఆదాయం తగ్గింది. కాని ఈసారి ఆ 40 శాతం ఆదాయం కూడా చేరుకోలేదు. క్రైం కంట్రోల్, క్రైం డిటెక్షన్ నిల్‌గా ఉన్నట్లు సమాచారం. 2022 సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు అలాగే అక్టోబర్ 01 నుంచి 9 వరకు, డిసెంబర్ 16 నుంచి 20 వరకు విధులకు హాజరు కాలేదని, ఒకేసారి సంతకాలు చేసినట్లు తెలిసినట్లు నివేదికలో పొందుపర్చినట్లు తెలుస్తోంది.

నాంపల్లిలో వచ్చిన ఫిర్యాదుపైనే..

ప్రస్తుత ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో 2021 ఫిబ్రవరికి ముందుగా హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఎస్‌హెచ్‌వో పనిచేశారు. అక్కడ ఆమెపై ఫిర్యాదు రావడంతో నిజామాబాద్‌కు బదిలీ చేశారు. ఇక్కడ కూడా ఎక్సైజ్ ఆదాయం, క్రైం కంట్రోల్, క్రైం డిటెక్షన్, లైసెన్స్ రెన్యూవల్ తదితర పనుల్లో నిర్లక్ష్యం చేసినట్లు తెలిసి విచారణ జరిపారు. ఈ నివేదిక పెండింగ్‌లో ఉండటంతో మళ్లీ విచారణ చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించినట్లు తెలిసింది. విచారణకు విచారణ అధికారులుగా సంగారెడ్డి సూపరింటెండెంట్ గాయత్రి, మల్కాజిగిరి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ముకుంద్‌రెడ్డిని నియమించారు. నిజామాబాద్‌లో ఎస్‌హెచ్‌వోపై ఎక్సైజ్ సిబ్బంది ఫిర్యాదు మేరకు నివేదిక కమిషనర్‌కు చేరడంతో గతంలో ఉన్న ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సంగారెడ్డి సూపరింటెండెంట్ గాయత్రిని వివరణ కోరగా నాంపల్లికి సంబంధించిన ఫిర్యాదుపైనే విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

తెయూ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ ఖో–ఖో (పురుషుల) జట్టును శుక్రవారం ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ టి.సంపత్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని తెయూ అనుబంధ కళాశాలల కు చెందిన 50 మంది ఖో–ఖో క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన వర్సిటీ ఖో– ఖో(పురుషులు) జట్టు ఈ నెల 9 నుంచి 12 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జేఎన్‌టీయూ లో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖో–ఖో (పురుషులు) టోర్నమెంట్ లో పాల్గొంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ లు బీఆర్‌నేత, డి.అనిల్ కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి



తెయూలో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి) : యూనివర్సిటీ విద్యార్థులు పీజీ పూర్తి కాగానే చదువు ఆపవద్దని, పరిశోధనలపై దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి (డిపార్ట్ మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ లా కాలేజ్ సెమినార్ హాల్‌లో శుక్రవారం 'డీఎస్‌టీ: అవగాహన కార్యక్రమం – సైన్స్, టెక్నాలజీ విభాగం' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య వక్తగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు గొప్ప ఆశయాలు ఉండాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ మాట్లాడుతూ.. తెయూ ఫార్మసీ విభాగం ప్రాజెక్టుకు డీఎస్‌టీ ద్వారా రూ.70 లక్షలు మంజూరు చేశారని, వర్సిటీ అభివృద్ధికి మరిన్ని సేవలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, సైన్స్ విభాగాల అధ్యాపకులు బి.శిరీష, ఎం.ప్రవీణ్, సత్యనారాయణరెడ్డి, జవేరియా ఉజ్మా, సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జట్టు సభ్యులతో అసోసియేషన్ ప్రతినిధులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ బాలికల జట్టుకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణులను పరిచయం చేసుకుని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తయిన అనంతరం జట్టు సభ్యులు ఈ నెల 12 నుంచి 14 వరకు ఖమ్మం జిల్లా బోనకల్లులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో జరిగే 67వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాం తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిషన్, రీజినల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.నీరజ, పీఈటీలు జోత్స్న, వినోద్, ప్రదీప్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు



దోమకొండ : దోమకొండ ఎక్సైజ్ శాఖ పరిధిలోని బీబీపేట మండలం మందాపూర్, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.బెల్ట్‌షాపులతో పాటు, పౌల్ట్రీఫాంల ను తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ పోతారెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం ఇటీవల బీబీపేటలో దొరికిన నేపథ్యంలో దాడులు చేసినట్లు ఆయన వివరించారు.ఎక్సైజ్‌సిబ్బంది శ్రీనివాస్,వాహిద్,శరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బార్‌లో వైన్స్ లిక్కర్..?

- సమాచారమున్నా కేసు నమోదు చేయని ఎక్సైజ్ అధికారులు..!

ఖలీల్‌వాడి : నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ లో ఇటీవల ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. డిసెంబర్‌లో నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఎక్సైజ్ అధికారి, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. బార్ లైసెన్స్‌పైనే మద్యం తీసుకోవాల్సి ఉంటుంది. కాని వైన్స్ నుంచి తీసుకొచ్చిన మద్యంను బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే మద్యాన్ని సీజ్ చేసి తర్వాత బార్ ఓనర్‌కు రూ. 4 లక్షల వరకు జరిమానా వేసే అవకాశాలుండగా, ఎక్సైజ్ అధికారి మాత్రం చర్యలు తీసుకోకుండా వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అదృశ్యం

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అదృశ్యమైనట్లు శుక్రవారం ఎస్సై లింబాద్రి తెలిపారు. యువతి శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరో పోలీస్‌స్టేషన్ పరిధిలో మరొకరు..

ఖలీల్‌వాడి : నగరంలోని ఆరవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంకాలనీకి చెందిన షేక్ రఫీక్(50) అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ గౌడ్ తెలిపారు. డిసెంబర్ 25 నుంచి ఉదయం 8:30 గంటలకు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటివరకు తిరిగిరాలేదని తెలిపారు. షేక్ రఫీక్ కూతురు షాహీరాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముట్టడి ఉద్రిక్తం



బండి సంజయ్‌తో మొర పెట్టుకుంటున్న మాస్టర్‌ప్లాన్ బాధిత రైతులు



కలెక్టరేట్ వద్ద పోలీసులు రైతుల మధ్య తోపులాట



కలెక్టరేట్ వద్ద గాయపడ్డ రైతు ఒడ్డె వెంకటి ఆస్పత్రికి తరలింపు



మాజీ మంత్రి షబ్బీర్ అలీని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



బండి సంజయ్‌ను వాహనంలో తరలిస్తున్న పోలీసులు

కాంగ్రెస్ ర్యాలీని సక్సెస్ చేయాలి



నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఈనెల 26 నుంచి 60 రోజుల పాటు చేపట్టే హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం సక్సెస్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగర పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు మాట్లాడుతూ ఎవరైతే ఈ కార్యక్రమాల్లో పనిచేయని డివిజన్ అధ్యక్షులని మార్చేసి కొత్తవారిని తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శులు రాం భూపాల్, రామకృష్ణ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, జావిద్ అక్రమ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామర్తి గోపి తదితరులున్నారు.

వైద్యుల క్రీడలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం : ప్రతినిత్యం వైద్య సేవలో బిజీగా ఉండే వైద్యులు మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత తెలిపారు. ఐఎంఏ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డేను సందర్భంగా శుక్రవారం రాజారం స్టేడియంలో నిర్వహించారు. వైద్యులకు 100 మీటర్స్, 200 మీటర్స్, 400 మీటర్స్, షార్ట్ పుట్ పోటీలను నిర్వహించారు. అనంతరం క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ నీలి రాంచందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతి రావ్, వైద్యులు విశాల్, హరీష్ స్వామి, ముత్తన్న, రవీంద్ర నాథ్ సూరి, చంద్రశేఖర్ రావు, వెంకటరమణ, చంద్ర శేఖర్ రెడ్డి, అరవింద్ రెడ్డి, ఆనంద్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, గోవింద్ నరేష్, మహిళ వైద్యులు మల్లీశ్వరి, ఫరీదాబేగం, సుజాత, శకుంతల వైద్యులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు



మాట్లాడుతున్న డీఏవో తిరుమల ప్రసాద్

ఇందల్వాయి : జిల్లాలో సాగవుతున్న అన్ని రకాల పంటలకు సరిపడా యూరియా సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని, జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. యూరియా కొరత వదంతుల నేపథ్యంలో నల్లవెల్లి సొసైటీని ఆయన శుక్రవారం సందర్శించారు. ఇప్పటిదాకా 13,118 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. మరో 4 వేల మెట్రిక్ టన్నులు సొసైటీల్లో, 5 వేల మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్‌లో, 2,600 మెట్రిక్ టన్నులు డీలర్ల వద్ద రైతులకు అందుబాటులో ఉందన్నారు. యాసంగికి 40వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మరో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపేందుకు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆమోదం తెలిపినట్లు డీఏవో తెలిపారు. ఆయన వెంట ఏవోలు రాంబాబు,ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి యువరైతు మృతి



మృతుడు పిట్ల మోహన్

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన పిట్ల మోహన్(28)అనే యువరైతు శుక్రవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో దాని కింద పడి మృతి చెందాడు. వరినారు మోయడానికి అదే గ్రామానికి చెందిన పిట్ల సాయిలు పొలం వద్ద కూలీపనికి వెళ్లిన మోహన్ ట్రాక్టర్ ట్రాలీలో వరినారు నింపుకుని తిరిగి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలో పడిపోయింది. ట్రాక్టర్ కింద ఇరుక్కున్న పిట్ల మోహన్ బురదలో కూరుకుపోయి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అయితే నారు మోయడానికి మాత్రమే కూలీపనికి వెళ్లిన తన భర్తకు డ్రైవింగ్ లైసెన్సు లేకున్నా బలవంతంగా ట్రాక్టర్ నడపాలని పిట్ల సాయిలు కోరడంతోనే తన భర్త మృతి చెందాడని మృతురాలి భార్య పిట్ల లక్ష్మి బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న వేంకటేశ్వర కాలనీలో అమోస్ కుమార్ వ్యక్తి ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇళ్లంతా పొగ కమ్ముకుంది. దీంతో అమోస్ వెంటనే ఇంటి పక్కన ఉన్న వాళ్లకు సమాచారం అందించి డోర్లను ధ్వంసం చేసి భార్య, పిల్లలతో బయటకు రావడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని సిబ్బంది మంటలను ఆర్పారు. సుమారు లక్షన్నర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఇంట్లో ఉన్న సామన్లు పూర్తి అగ్నికి ఆహుతైందన్నారు.

బోరు మోటార్ల చోరీ నిందితుల పట్టివేత

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండలంలోని తానాకలాన్ శివారులో బోరు మోటార్లను దొంగతనం చేస్తున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బోరు మోటార్ పరికరాలు తీసుకొని వెళ్తుండగా గ్రామస్తులు పట్టుకుని వారికి దేహశుద్ధి చేశారు. అనంతరం వివరాలు అడగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారిని పోలీసులకు అప్పగించారు.

గంగుల శ్రీనివాస్‌పై రౌడీషీట్

ఎల్లారెడ్డి : పట్టణానికి చెందిన గంగుల శ్రీనివాస్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన గంగుల శ్రీనివాస్ ఇటీవలే ఓ మహిళను హత్య చేసి 3 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన కేసులో అరెస్ట్ చేసి రిమాండ్ చేశామన్నారు. శ్రీనివాస్‌పై గతంలోనూ కేసులు నమోదు కావడంతో దీనిని దృష్టిలో ఉంచుకుని అతడిపై రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రాజంపేట : రాజంపేట మండలంలో అటవీ ప్రాంత నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కస్టడీలో ఉంచినట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ రమేశ్ తెలిపారు. శుక్రవారం గుండారం ఫారెస్ట్ పరిధిలో నడిమి తండా గ్రామ పంచాయతీ పరిధికి చెందిన జైసింగ్, సతీశ్ అక్రంగా ఇసుక తరలిస్తుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. సంబంధిత ట్రాక్టర్లను తమ కస్టడీలో ఉంచామన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతి చెందిన బోండ్ల యాకూబ్

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన బోండ్ల యాకూబ్(21) శుక్రవారం నిజామా బాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందా డు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బోండ్ల యాకూబ్ విపరీతంగా తాగుతూ మ ద్యానికి బానిసయ్యాడు. తండ్రి స్వామి మద్యం తాగవద్దని మందలించడంతో అలిగిన యాకుబ్ ఈనెల 1న ఇంట్లో నుంచి రూ. 500 తీసుకుని యాకూబ్ బయటకు వెళ్లి ఎలుకల మందు కొని తాగాడు. దీంతో యాకూబ్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని యువతి..

ఎడపల్లి(బోధన్) : మండల కేంద్రంలో రైలు ఢీకొట్టిన సంఘటనలో ఇదే గ్రామానికి చెందిన లింగమణి (35) మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. పొలం పనుల నిమిత్తం రైలు పట్టాల వెంబటి ఆమె పొలానికి వెళ్తుండగా అదే సమయంలో బోధన్ వెళ్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ లింగమణిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి మానసిక స్థితి బాగా లేకపోవడంతో ట్రైన్ శబ్దం వినిపించినప్పటికీ పక్కకు వెళ్లకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

పిట్లం(జుక్కల్) : మండలంలోని చిన్నకొడప్‌గల్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కల్హేర్ గ్రామానికి చెందిన మల్లేశ్ బైక్‌పై కల్హేర్ నుంచి చిన్నకొడప్‌గల్ గ్రామానికి వెళ్తుండగా చిన్నకొడప్‌గల్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మల్లేశ్ కిందపడ్డాడు. అతడిని హైవే సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పిట్లం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన మృతి చెందారు.

బ్యాంక్ మేనేజర్‌పై ప్రభుత్వ టీచర్ దాడి

ఖలీల్‌వాడి : నగరంలోని మూడవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ నూన్ గణేశ్‌పై చంద్రశేఖర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కమలా ప్రకాష్ ఈ నెల 30న దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంక్ మేనేజర్ తన విధులు నిర్వహిస్తుండగా ఆకారణంగా దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరణ కోరగా బ్యాంక్‌లో దాడి చేసినట్లు సీసీ టీవీ పుటేజీలో నమోదైందన్నారు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోటగిరి స్కూల్‌ను సందర్శించిన ఏసీపీ

కోటగిరి : కోటగిరి జెడ్పీ హైస్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ దళిత టీచర్‌కు ఆలయంలో బొట్టు పెట్టిన సంఘటనకు సంబంధించిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో బోధన్ ఏసీపీ శుక్రవారం నుంచి విచారణ ప్రారంభించారు. హైస్కూల్‌ను సందర్శించి ప్రత్యక్ష సాక్షులు, కొందరు విద్యార్థులను విచారించి వీడియో రికార్డు చేశారు. ఏసీపీ వెంట రుద్రూర్ సీఐ జాన్‌రెడ్డి, కోటగిరి ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఉన్నారు. విచారణను శుక్రవారం ప్రారంభించామని సాక్షులందరినీ విచారించి ఆధారాలు సేకరించడానికి కొంత సమయం పడుతుందని ఏసీపీ కిరణ్ కుమార్ వెల్లడించారు.